క్లుప్తంగా

సచివాలయ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు టౌన్: మూడు సంవత్సరాలుగా సచివాలయాల్లో ఏఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.సురేష్‌కుమార్‌కు యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఎన్ఎంలకు రావాల్సిన అలవెన్సులు, ఆర్‌సీహెచ్ డేటా ఎంట్రీ అలవెన్సులు మంజూరు చేయాలని కోరారు. సీనియర్ ఏఎన్ఎంలకు ఎల్‌హెచ్‌వీ శిక్షణ ఇవ్వాలని, శిక్షణ ఆలస్యం కావడంతో సర్వీసుపరంగా, ఆర్థికంగా నష్టం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కేఎస్ పల్లి, బండ్లమూడి, కరవది సచివాలయ ఏఎన్ఎంలు తిరుమలమ్మ, కళావతి, లక్ష్మీదేవి, శ్రీదేవి, డి.మేరి, శ్యామల, ఎం.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, యూనియన్ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల షెడ్ల నిర్మాణానికి రాయితీ ఇవ్వాలి


చీమకుర్తిలో వినతిపత్రం అందిస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ నాయకులు

చీమకుర్తి: గొర్రెల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీ అందించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చీమకుర్తిలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెల షెడ్ల నిర్మాణానికి 70 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. పశువుల యజమానుల మధ్య తారతమ్యాలు లేకుండా గొర్రెల షెడ్ల నిర్మాణానికి కూడా పశువులకు ఇచ్చినట్లుగా 90 శాతం రాయితీ ప్రకటించాలన్నారు. దాంతో పాటు నగర పంచాయతీ, మున్సిపాలిటీల్లోని గొర్రెలు, మేకల పెంపకందారులకు ఈ పథకం వర్తింపజేయాలన్నారు. పార్టీలకతీతంగా రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన లబ్ధిదారులకు కనీసం ప్రతి ఊరికి 10 యూనిట్లకు తగ్గకుండా అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూసపాటి వెంకట్రావు, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ నాయకులు బొడ్డు రామమూర్తి, ఎం.సుబ్బారావు, స్థానికులు పాల్గొన్నారు.

108లో కాన్పు


108లో ప్రసవించిన కొండమ్మ, శిశువుతో అంబులెన్స్ సిబ్బంది

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామం వెంకటేశ్వర యానాది కాలనీకి చెందిన పులి కొండమ్మ సోమవారం 108 వాహనంలో ప్రసవించింది. ఆమె పురిటి నొప్పులతో బాధపడుతూ బస్ చార్జీలు పెట్టుకుని హాస్పిటల్‌కు వెళ్లే స్థోమత లేక 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసింది. పది నిమిషాల్లోనే ఆమె వద్దకు చేరుకున్న 108లో ఒంగోలు జీజీహెచ్‌కి వెళ్తుండగా, మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఆ బాధ భరించలేక ఎక్కిళ్లు పెట్టి ఏడుస్తుండటంతో ఈఎంటీ చిట్టితోటి స్వర్ణ, పైలెట్ సాబినేని సురేంద్ర కాన్పుచేశారు. సుఖప్రసవం జరగడంతో పాటు మగ బిడ్డ పుట్టడంతో కొండమ్మ, ఆమె కుటుంబ సభ్యులు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో 108 సిబ్బందిని అభినందించారు. అనంతరం వారిని జీజీహెచ్‌కి తరలించారు.


వేల్ కావడి నగరోత్సవంలో భారీగా పాల్గొన్న సుబ్రహ్మణ్యస్వామి భక్తులు


స్కందగిరి వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి పూజలో పాల్గొన్న భక్తులు


నగరోత్సవంలో మేళతాళాలు

సుబ్రహ్మణ్యా.. పాహిమాం


కేశవస్వామిపేట శివాలయంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజల అనంతరం నగరోత్సవానికి వస్తున్న భక్తులు

- వైభవంగా వేల్ కావడి మహోత్సవం

ఒంగోలు మెట్రో: వేల్ కావడి మహోత్సవాన్ని ఒంగోలు నగరంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. క్రోధి నామ సంవత్సరం ఆషాఢ మాసం ఆడి నెల ఆరు శక్తి క్షేత్రాలలో జరిగే ఉత్సవమైన కావడి సేవ సందర్భంగా నగరోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఒంగోలు కొండమీద స్కందగిరి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, రంగారాయుడు చెరువు దగ్గరున్న సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, భీమరాజువారివీధిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు అయ్యప్ప నగర్ అయ్యప్పస్వామి క్షేత్రంలో ఉపాలయంగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, సీతారాంపురంలోని వరాల సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు అయ్యప్పనగర్లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో ఉదయం ఆరు గంటలకు ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చన పూజ క్రతువులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కేశవస్వామిపేటలోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయంలో వెలసి ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధానంలో వేల్ కావడి పూజ నిర్వహించారు. భక్తులు సుబ్రహ్మణ్యస్వామివారి హస్తంలో ఉన్న వేలాయుధం ధరించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవమూర్తులను స్వామివారి నెమలి వాహనంపై ఉంచి ఊరేగించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో నగరంలోని పొట్టి శ్రీరాములు బొమ్మ, ఏనుగు చెట్టు, దక్షిణం బజారు, గాంధీబొమ్మ సెంటర్, గాంధీ రోడ్డు, పఠాన్ బజారు, కోర్టు సెంటర్ మీదుగా కొండమీద స్కందగిరి శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం వరకు వేల్ కావడి నగరోత్సవం సాగింది. స్థానిక భక్తులు స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని స్వామివారి వేలాయుధ దీక్షను విరమింపజేశారు. సాయంత్రం ఆరు గంటలకు వేల్ కావడి దీక్ష తీసుకున్న వారు సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానంలో గాలిగోపురం మీద వెలిగించిన కృత్తికా దీపాన్ని దర్శనం చేసుకుని సుబ్రహ్మణ్యస్వామి ఆశీసులు అందుకున్నారు.


శూలాలు గుచ్చుకుని కొబ్బరిబోండాలు లాగుతున్న భక్తుడు


శూలాలు గుచ్చుకుని నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు



వేల్ కావడి మోస్తున్న సుబ్రహ్మణ్యస్వామి భక్తులు


సుబ్రహ్మణ్యస్వామి వేషధారణలో పాల్గొన్న చిన్నారి

నిబంధనలకు విరుద్ధంగా పెట్రోలు బంకు ఏర్పాటు

- గ్రీవెన్స్‌లో గ్రామస్తుల ఫిర్యాదు

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరం గ్రామ పంచాయతీ పరిధిలో పెట్రోల్ బంకును నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో అర్జీ అందజేసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెట్రోలు బంకుకు ఒక కిలోమీటర్ దూరం వరకూ ఎటువంటి ఇళ్లు లేవని, విద్యాసంస్థలు, ఆస్పత్రులు లేవని వీఆర్ఓ తన రిపోర్టులో రాసి ఉన్నారని తెలిపారు. కానీ, ఆ రిపోర్టు వాస్తవం కాదన్నారు. పెట్రోలు బంకు ఎదురుగా 45 మీటర్ల దూరంలో పీఎస్ జిల్లాపరిషత్ హైస్కూల్, 60 మీటర్ల దూరంలో పీఏసీ సొసైటీ బిల్డింగ్, ఉందన్నారు. తూర్పువైపున 20 మీటర్ల దూరంలో కోటు వారి పొగాకు బ్యారన్, పశ్చిమం వైపున పెట్రోల్ బంకును ఆనుకునే బ్రిక్ యూనిట్, ఆ పక్కనే చర్చి, ఇళ్లు ఉన్నాయని తెలిపారు. ఐదు వందల మీటర్ల దూరంలో డిగ్రీ కళాశాల ఉందని రికార్డులో పేర్కొన్నారని, కానీ, వాస్తవానికి దొడ్డవరం గ్రామంలో కళాశాలే లేదని అన్నారు. వాస్తవాలకు విరుద్ధంగా రిపోర్టులు రాసి పెట్రోలు బంక్ ఏర్పాటు చేయడానికి పలువురు అధికారులు సహకరిస్తున్నారని వారు తెలిపారు. స్థలం యజమాని పేరున ఎన్‌ఓసీ తీసుకున్నారని, లైసెన్సు ఉన్న వ్యక్తి పేరున ఎన్‌ఓసీ లేదని ఫిర్యాదులో గ్రామస్తులు పేర్కొన్నారు. దీనిపై పునర్విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ, తహసీల్దార్‌ను కోరారు.


దొడ్డవరంలో పెట్రోలు బంకు ఏర్పాటుపై అభ్యంతరాలు తెలుపుతూ అర్జీ ఇస్తున్న గ్రామస్తులు

గ్రీవెన్స్‌కు మొత్తం 4 అర్జీలు...

గ్రీవెన్స్‌లో వివిధ రకాల సమస్యలపై మొత్తం 4 అర్జీలు రాగా, వాటిలో ఒకటి భూమి కొలత సరిచేయాలని, మరొకటి గుండ్లాపల్లిలో సైడు కాలువ నిర్మించాలని, ఇంకోటి కపిల్ చిట్స్ వేసిన వెంచర్‌లో ఇంటి తాలూకు కొలతలు ఇవ్వాలని వచ్చాయి.

మెడికల్ యూనియన్ అధ్యక్షునిగా సురేష్


అధ్యక్షుడు వై.సురేష్


ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు

ఒంగోలు టౌన్: యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షునిగా వై.సురేష్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీధర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా కె.అప్పలరాజు, గౌరవాధ్యక్షునిగా కాలం సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా బి.కృష్ణ, కె.జయకుమారి, సహాయ కార్యదర్శులుగా ఈ ధనలక్ష్మి, సి.శారదలను ఎన్నుకున్నారు. మరో 18 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. నూతన కమిటీని ఆయన అభినందించారు.

అలసత్వం వహిస్తే కఠిన చర్యలు


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు చూస్తున్న రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాల

- బాలల విషయంలో బాధ్యతగా ఉండాలి
- రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల పరిరక్షణ, భోజనం, ఫీడింగ్ విషయాలలో అశ్రద్ధ వహిస్తే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి హెచ్చరించారు. పట్టణంలోని డీఆర్ఆర్ఎం హైస్కూల్‌తో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండి పర్యవేక్షించాలని కోరారు. ఆహార విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాలబాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఫిర్యాదు బాక్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఆమె వెంట ఎంఈఓ సరస్వతి, అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయభాస్కర్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ...

నగరంలోని కబాడీపాలెం-1, 2, ఎన్‌జీఓ కాలనీ, ఇందిరా కాలనీ, మరాఠీపాలెం, క్రిస్టియన్‌పాలెం, వడ్డెపాలెం, మిరియాలపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో లోపాలను సరిదిద్దాలని సూపర్‌వైజర్ ఆదిలక్ష్మిని కోరారు. ఆమె పర్యవేక్షణ పెంచే విధంగా తగిన ఆదేశాలు ఇవ్వాలని సీడీపీఓ ఫణిరాజకుమారిని కోరారు. గుడ్లు, పాల పంపిణీలో ఉన్న వ్యత్యాసాలను గుర్తించారు. మీ పిల్లలు అయితే ఇలాగే ఇస్తారా.? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలల విషయంలో శ్రద్ధగా పని చేయాలని కోరారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు డి.నీలిమ వంశీలత, లీగల్ కం ప్రొబేషన్ ఆఫీసర్ బి.రత్నప్రసాద్, సోషల్ వర్కర్ ఎస్.రామాంజనేయులు పాల్గొన్నారు.

తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులను విధుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే నగర పాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను తొలగించడం దుర్మార్గమని అన్నారు. ప్రజలందరికీ ప్రాతినిధ్యం వహించాల్సిన ప్రభుత్వం నిరుపేద ప్రజల నోటికాడి కూడును కాలితో తన్నడం అమానవీయమని, తొలగించిన పారిశుధ్య కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ వద్ద సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. మార్పు తీసుకొస్తామని చెప్పి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చిన కొద్దిరోజులకే పారిశుధ్య కార్మికుల ముందున్న అన్నం గిన్నెను కాళ్లతో తన్నేశారని, ఇదేనా మీరు చెప్పిన మార్పు అని ప్రశ్నించారు. ప్రజలందరికీ మెరుగైన జీవితాలను, భద్రతను కల్పించాల్సిన పాలకులే వారిని పేదరికంలోకి నెట్టేయడం, అభద్రతకు గురి చేయడం భావ్యం కాదని చెప్పారు. కోవిడ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో తీసుకోవాలని, నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలివ్వాలని, పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సామ్రాజ్యం, కె.పద్మ, దివ్య, ఆర్.రాములు, వెంకటేశ్వర్లు, వంశీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.360

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. సోమవారం కేజీ పొగాకు గరిష్ట ధర రూ.360 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం... రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో సోమవారం మొత్తం 9,533 బేళ్లు వేలానికి రాగా, 8,471 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,062 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు వేలం కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 117వ రోజు వేలం పాటలో 4,789 బేళ్లు వేలానికి రాగా, 4,203 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 586 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.289.55 పలికింది. అదేవిధంగా కందుకూరు-1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో సోమవారం 111వ రోజు నిర్వహించిన వేలం పాటలో 4,744 బేళ్లు వేలానికి రాగా, 4,268 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 476 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.306.21 పలికింది.

గంగమ్మతల్లికి భక్తిశ్రద్ధలతో కల్లిపాటు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


గంగమ్మతల్లికి కల్లిపాటు నిర్వహిస్తున్న భక్తులు

- ముగిసిన నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

కొత్తపట్నం: స్థానిక నాంచారమ్మతల్లి ఆలయ బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా చివరిరోజైన సోమవారం గంగమ్మతల్లికి కల్లిపాటు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాంచారమ్మతల్లి ఆలయం పక్కనే ఉన్న గంగమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు, కల్లిపాటు నిర్వహించారు. గంగమ్మతల్లి ఆలయం నుంచి బొల్లావులు, భక్తనయ్య, కాటంరాజు, గంగమ్మతల్లి వేషాలతో మేళతాళలతో ఊరేగించుకుంటూ మర్రిఏరు దగ్గరకు చేరుకున్నారు. అక్కడ గంగాకాటంరాజు, తరకవాధన కథ కార్యక్రమం నిర్వహించారు. అక్కడకు భక్తులు గంగాదేవి కథా కార్యక్రమాన్ని ఆలపించారు. గంగమ్మతల్లి విశిష్టత, పూర్వపు చరిత్ర, ఎక్కడ పుట్టిందనే విషయాన్ని కథ, పాటల రూపంలో వినిపించారు. భక్తులు గంగమ్మతల్లిని అధిక సంఖ్యలో దర్శనం చేసుకున్నారు. నాంచారమ్మతల్లి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసి కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందించారు.

రేపు పాలిటెక్నిక్ కాలేజీలో
స్పాట్ అడ్మిషన్లు

కొత్తపట్నం: మండలంలోని ఈతముక్కల గ్రామంలో ఉలిచి వెంకారెడ్డి-సీతారావమ్మ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఏసుప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీపీ) డిప్లమా కోర్సులో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. పదో తరగతి పాసై పై కోర్సు చదివేందుకు ఆసక్తి గల విద్యార్థినులు ఈ నెల 31వ తేదీ ఉదయం పదో తరగతి మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, విద్యార్థిని ఆధార్ కార్డు (ఇవన్నీ ఒక సెట్ ఒరిజినల్, రెండు సెట్లు జిరాక్స్ కాపీలు) తీసుకురావాలని కోరారు. ఎంపికైన విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజు రూ.4,700, ప్రాసెసింగ్ ఫీజు రూ.1,100, హాస్టల్‌లో చేరదలచిన వారు అదనంగా హాస్టల్ ఫీజు చెల్లించాలన్నారు. స్పాట్ అడ్మిషన్లలో చేరిన విద్యార్థినులకు డిప్లమా కోర్సు మూడు సంవత్సరాల కాలంలో ఎలాంటి ఉపకార వేతనాలు, ఫీజు రాయితీలు ఇవ్వబడవన్నారు. పూర్తి వివరాలకు 94418 85492, 86861 22212 నంబర్లను సంప్రదించాలని కోరారు.